సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 19 । జనవరి । 2025



వైభవంగా బ్రహ్మోత్సవాలు

నల్లమలలో ఉమామహేశ్వరుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



కిటకిటలాడిన రంగాపురం

రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ ఉర్సు శనివారం ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /14.1

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి సమయంలో చల్లని గాలులు వీస్తాయి. చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దేవరకద్ర మున్సిపాలిటీగా గెజిట్ విడుదల

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు దేవరకద్ర మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డులను విభజించింది. దేవరకద్ర, చౌదర్‌పల్లి, మీనుగోనిపల్లి, పెద్దగోప్లాపూర్, బల్సుపల్లిలు మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయి.

పారదర్శకంగా కేసుల విచారణ



మహబూబ్‌నగర్ క్రైం: ప్రతి కేసు విచారణలో పూర్తిగా పారదర్శకత ఉండటంతోపాటు వేగంగా పూర్తిచేయాలని ఎస్పీ జానకి అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టులో న్యాయ ప్రక్రియను పూర్తి సమర్థవంతంగా చేపట్టాలన్నారు. ఎలాంటి కేసులో ఏ రకమైన ఆధారాలు పొందుపరచాలి.. సాక్షులను ఎలా హాజరుపరచాలి.. తదితర అంశాలపై అన్నిరకాలుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోర్టు సంబంధిత రికార్డుల నిర్వహణ, సమన్లు, వారెంట్లు అమలు చేయడం, కేసులపై సమయానికి నివేదికలు సమర్పించడం చేయాలన్నారు. పోలీస్ పనితీరును మరింత మెరుగుపరచుకోవడానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సుదర్శన్ రెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

21న జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఉద్యోగ గుర్తింపు, ఆధార్ కార్డుతో ఉదయం 7.30 గంటలకు మెయిన్ స్టేడియంలో సునీల్‌కుమార్ (సెల్ నం.94406 56162) వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎంపికలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

ఆరుగురికి ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో ఏఆర్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న ఆరుగురికి ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో నాగరాజు, తిరుపతయ్య, సురేందర్‌గౌడ్, ఆంజనేయులు, రామచందర్, శ్రీనివాసులు ఉన్నారు. వీరిలో ఐదుగురికి నారాయణపేట జిల్లాలో.. మరొకరికి నాగర్‌కర్నూల్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. పదోన్నతి పొందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లను డీఐజీ అభినందిస్తూ తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సుదీర్ఘ సేవలు, క్రమశిక్షణ గుర్తించి పదోన్నతి లభిస్తాయని, సేవలకు ప్రోత్సాహకరంగా ప్రతిఒక్కరూ ఉండాలని చెప్పారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ జడ్చర్ల టౌన్: పాలెంలోని జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగింది. ఈ మేరకు అధికారులు జిల్లావ్యాప్తంగా మొత్తం 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో మొత్తం 1,260 మంది హాజరుకావాల్సి ఉండగా కేవలం 924 మంది మాత్రమే హాజరవగా.. 336 మంది గైర్హాజరయ్యారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాలను డీఈఓ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు తనిఖీ చేశారు. అలాగే బాదేపల్లి బాలుర జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ సయ్యద్ ఇబ్రహీం, స్క్వాడ్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తనిఖీ చేశారు.





గానుగ తిప్పుతున్న దృశ్యం

సగటున వంద కిలోలు..

మొదట ఇంటి వరకు మాత్రమే అనుకొని గానుగ నూనెను తీసేవారు. ఆ తర్వాత నెలకు 450 కిలోల నూనె తీసేవారు కాగా.. డిమాండ్ బాగా పెరగడంతో నెలకు వెయ్యి కిలోల నూనె తయారీకి శ్రమించారు. ప్రస్తుతం రోజుకు సరాసరి 50 నుంచి 100 కిలోల చొప్పున 9 గానుగల ద్వారా మొత్తంగా నెలకు 3 వేల కిలోల వరకు నూనె తీస్తున్నారు.

ఆరోగ్యప్రదాయిని

సిరులు కురిపిస్తున్న గానుగ నూనె

- ఆరోగ్యానికి మేలు చేకూరుస్తుండటంతో పెరుగుతున్న డిమాండ్
- 9 గానుగల ద్వారా నెలకు 3 వేల కిలోల దాకా ఉత్పత్తి
- మారుమూల జక్లపల్లి నుంచి విదేశాలకు సైతం ఎగుమతి
- అందరి మన్ననలు అందుకుంటున్న కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజ్

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వారిద్దరు ప్రాణస్నేహితులు. రామకృష్ణ మఠంలో వలంటీర్లుగా పనిచేశారు. తన తల్లి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఒకరు.. రాజీవ్ దీక్షిత్‌ల ప్రసంగాలతో మరొకరు.. ఇలా ఇద్దరూ కలిసి గానుగ నూనె తయారీకి శ్రీకారం చుట్టారు. తొలుత తమ ఇంటి వరకే అనుకున్న వారు.. ప్రజలకు ఆరోగ్యపరంగా మేలు చేయాలనే లక్ష్యంతో విస్తరించారు. ఆరోగ్యప్రదాయిని పేరుతో గానుగ నూనె తయారు చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. మారుమూల పల్లె నుంచి విదేశాలకు ఎగుమతి చేసే వరకు ఎదిగిన మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలంలోని జక్లపల్లి గ్రామానికి చెందిన కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజ్ విజయగాథపై ప్రత్యేక కథనం..

తల్లి ఆరోగ్యం కోసం...

కోట్ల శ్రీనివాస్‌రెడ్డి తల్లి కోట్ల జయమ్మకు 2018లో రొమ్ము కేన్సర్ వచ్చింది. హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో చూపించారు. పదిసార్లు కీమోథెరపీ చేయాలని డాక్టర్లు సూచించగా.. రెండుసార్లు చేయించారు. ఈ క్రమంలో ఆయుర్వేద మందులతో నయమవుతుందని పలువురు చెప్పడంతో కీమోథెరపీ వదిలేసి కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌కు వెళ్లి ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు ఖాదర్‌వలీని కలిశారు. కేన్సర్‌కు కల్తీ నూనెల వాడకమే ప్రధాన కారణమని.. వాటిని మానేసి గానుగ నూనె వాడాలని, దీంతోపాటు చిరుధాన్యాలు తీసుకోవాలని ఆయన సూచించారు. మైసూర్‌లో నూనె గానుగలు ఉన్నాయని, వాటిని ఒక్కసారి చూడాలని చెప్పడంతో శ్రీనివాస్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న నూనె

స్నేహితుడు బస్వరాజ్‌తో కలిసి..

మైసూర్‌లో నూనె గానుగలను పరిశీలించిన తర్వాత శ్రీనివాస్‌రెడ్డి ఆరు నెలల పాటు మహబూబ్‌నగర్‌లో ఎలక్ట్రిక్ గానుగ నుంచి తీసిన నూనెను కొనుగోలు చేసి వినియోగించాడు. ఈ క్రమంలో సొంతంగా గానుగ ఏర్పాటు చేయాలనే ఆలోచనకు వచ్చి.. 2019లో తన స్నేహితుడు బస్వరాజ్‌తో కలిసి కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జక్లపల్లిలో తన పొలంలో రూ.3 లక్షల వ్యయంతో ఎద్దుల కట్టె గానుగను ఏర్పాటు చేశారు. పల్లి, కొబ్బెర, అవిసె, కుసుమ, నువ్వులతో నూనె తీయడం ప్రారంభించారు. ఆ తర్వాత రూ.25 లక్షల రుణంతో వాటిని ఐదు గానుగలకు పెంచారు. గానుగ నూనెకు డిమాండ్ పెరగడంతో కట్టెతోపాటు 9 రాతి గానుగలు ఏర్పాటు చేసి నూనె తీస్తున్నారు.



నూనె నింపుతూ తూకం వేస్తున్న కూలీలు

ఇంటి వరకే అనుకుని ప్రారంభించాం..



అప్పట్లో అమ్మ ఆరోగ్యం బాగలేదు. వైద్యుడు ఖాదర్‌వలీ సూచనతో గానుగ నూనె వాడాలనుకున్నా. తొలుత ఇంటి వరకు తయారు చేయాలనుకుని ఒక్క గానుగతో ప్రారంభించాం. అమ్మ ఆరోగ్యం కుదుటపడడం.. గానుగ నూనెకు డిమాండ్ పెరగడంతో ప్రైవేట్ టీచర్ జాబ్ వదిలేసి దీనిపైనే దృష్టిపెట్టా. విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం సంతోషంగా ఉంది.

– కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, గానుగ నూనె తయారీదారుడు

ఒడిశా, కర్ణాటక నుంచి..

గానుగ ద్వారా ఒక్కకిలో నూనె తయారీకి మూడు కిలోల పల్లీలు గానీ, కుసుమలు గానీ అవసరం. ఈ మేరకు వివిధ రకాల నూనెలను గానుగ ద్వారా తీసేందుకు అవసరమైన ముడి సరుకులకు వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ప్రతినెలా 6టన్నుల పల్లీలు, 2 టన్నుల కొబ్బరి, 3 టన్నుల కుసుమ, 2టన్నుల నువ్వులు అవసరమవుతాయని నిర్వాహకులు తెలిపారు. వీటిలో గడ్డి నువ్వులు ఒడిశా.. కుసుమ, కొబ్బరి కర్ణాటక.. పల్లీలు, నువ్వులను మహబూబ్‌నగర్ నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు వెల్లడించారు.

విదేశాలకు ఎగుమతి..

గానుగల ద్వారా తీసిన వివిధ రకాల నూనెలను మొదట స్థానికంగా విక్రయించిన వీరు.. హైదరాబాద్‌లోని ఓ సంస్థ సహకారంతో విదేశాలకు రవాణా చేస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి దాదాపు 4 వేల కిలోల మేర నూనెను దుబాయ్, సింగపూర్, మలేషియా వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, హరియాణా తదితర రాష్ట్రాలకు కొరియర్ ద్వారా సైతం గానుగ నూనె సరఫరా చేస్తున్నారు. రకాన్ని బట్టి ఒక్కో కిలోకు రూ.300 నుంచి రూ.450 వరకు రిటైల్, హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. గానుగ తీసిన తర్వాత వచ్చే పిప్పిని పశువుల దాణా కోసం విక్రయిస్తున్నారు. దీనికి స్థానికంగా గిరాకీ ఉండగా.. కిలోకు రూ.40 చొప్పున ధర పలుకుతోంది.

అందరికీ అందుబాటులోకి..



ప్రజల ఆరోగ్యం కోసం స్వచ్ఛమైన గానుగ నూనె తయారు చేయాలని సంకల్పించి.. చిన్నగా ప్రారంభించాం. డిమాండ్ పెరగడంతో అందరికీ అందుబాటులోకి తేవాలనుకున్నాం. ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, జార్ఖండ్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించారు. యూనిట్ నిర్వహణ, రుణ సౌకర్యం, మార్కెటింగ్ వంటి అంశాలపై 1,200 మందికి శిక్షణ ఇచ్చాం. ఆయా రాష్ట్రాల్లో 250 గానుగలు ఏర్పాటుకు కృషిచేశాం.

– బస్వరాజ్, గానుగ నూనె తయారీదారుడు

సమగ్ర పరిశీలన తర్వాతే లబ్ధిదారుల ఎంపిక



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, పక్కన అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు సమగ్ర పరిశీలన చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. లబ్ధిదారుల ఎంపికపై నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలనపై శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్షించారు. రైతు భరోసా కార్యక్రమం కింద వ్యవసాయ యోగ్యమైన భూమి, రేషన్ కార్డుల వెరిఫికేషన్‌పై క్షేత్రస్థాయి పరిశీలన మండలాల వారీగా ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సమీక్షించి సూచనలు చేశారు. ఇప్పటి వరకు ఎన్ని రెవెన్యూ గ్రామాలు పూర్తి చేశారు.. ఇంకా ఎన్ని గ్రామాలు పూర్తి చేయాల్సి ఉంది.. రేషన్ కార్డుల వెరిఫికేషన్ ఎంత వరకు వచ్చింది.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రైతు భరోసాలో భాగంగా వ్యవసాయ శాఖతో రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకుని సాగుకు యోగ్యం కాని భూములను, గుట్టలు, వెంచర్లు, భూసేకరణలో భాగంగా ప్రాజెక్టులు, చెరువులు, కాల్వలు, రహదారుల కోసం తీసుకున్న భూముల వివరాలు జాబితాలో ఉండకూడదన్నారు. సాగుకు యోగ్యమైన భూముల జాబితా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. రేషన్ కార్డుల కోసం సమగ్ర కుటుంబ సర్వేలో వచ్చిన దరఖాస్తుదారుల పూర్తి వివరాలు పరిశీలించి.. అర్హుల జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 16 నుంచి నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలనలో ఇంకా మిగిలిన గ్రామాలను సోమవారం వరకు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల జాబితా ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే గ్రామసభలలో నాలుగు పథకాల లబ్ధిదారుల పేర్లను వివరించాలని, అలాగే లబ్ధిదారుల పేర్లను కూడా ప్రదర్శించాలని చెప్పారు. గ్రామసభలో ఆమోదం పొందిన తర్వాత అర్హుల జాబితా రూపొందించాలని, అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో స్వీకరించాలని సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ప్రభుత్వం మార్గదర్శకాలు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌డీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని, ఇదొక నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ఆయా పథకాల అమలుపై కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ అర్హులైన చిట్ట చివరి వ్యక్తికి పథకాలు అందజేసేందుకు కృషిచేస్తామన్నారు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కుల, సామాజిక, ఆర్థిక సర్వే, పాత రేషన్ కార్డుల ఆధారంగా పేర్లు నమోదు చేస్తామన్నారు.

బ్రహ్మాండంగా మన్యంకొండ అభివృద్ధి



మన్యంకొండ నూతన పాలక మండలి డైరెక్టర్లతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మన్యంకొండను బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి పాలక మండలి నూతన డైరెక్టర్ల ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన్యంకొండ దేవస్థానం అభివృద్ధికి రూ.130 కోట్ల అంచనాతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే దేవస్థానం ట్రస్ట్ చైర్మన్‌తోపాటు దేవాదాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని, వాటి ఆధారంగా పనులు చేపట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేశారన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో మరోసారి ఆలయాన్ని సందర్శించి భక్తులకు అవసరమైన మరిన్ని సౌకర్యాల గురించి చర్చించి వాటి కల్పన కోసం కృషి చేస్తానన్నారు. భక్తులకు ఎలాంటి సౌకర్యాలు గుర్తించి అందించే దిశగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. మన్యంకొండ జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. గతేడాది సమయభావంతో దేవస్థానం నియమించిన ఉత్సవ కమిటీనే ఇప్పుడు పాలక మండలి డైరెక్టర్లుగా నియమించారన్నారు. అనంతరం మన్యంకొండ దేవస్థానం వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. వేద ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ పైసలేవి..?

- ఏళ్లు గడిచినా జమకాని నిధులు
- పరిష్కారానికి నోచుకోని సమస్య
- ఇప్పటికే 27 మంది కార్మికుల మృతి
- బాధిత కుటుంబీకులకు చేకూరని లబ్ధి





జడ్చర్లలో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు (ఫైల్)

జడ్చర్ల టౌన్: ప్రతి ఉద్యోగి కుటుంబానికి భరోసానిచ్చేవి పీఎఫ్ పైసలు. ఈ నిధుల కూడా గోల్‌మాల్ అయి ఏళ్ల తరబడిగా బాధిత కుటుంబాలకు అందక మదనపడుతున్నారు. మున్సిపాలిటీలో ఒకరిద్దరు సిబ్బంది చేసిన చిన్న తప్పిదానికి భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. 2012లో మొదలైన ఈ సమస్య నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. 2012 నుంచి ఇప్పటి వరకు ఇద్దరు కార్యదర్శులు, 8 మంది కమిషనర్లు బదిలీ అయ్యారు. అయినా పీఎఫ్ సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఒకవైపు 27మంది కార్మికులు మృత్యువాత పడగా పీఎఫ్ నిధి నుంచి జరిమానాల రూపంలో ఏకంగా రూ.90 లక్షలు చెల్లించాలని నోటీసులు అందుకోవాల్సి వచ్చింది.

బాదేపల్లి మున్సిపాలిటీలో..

2011 డిసెంబర్‌లో బాదేపల్లి మున్సిపాలిటీగా మారింది. అప్పట్లో 106 మంది కార్మికుల నెల జీతాల నుంచి ఈఎస్‌ఐ, పీఎఫ్ కోసం 12 శాతం డబ్బులు కట్ చేస్తూ వచ్చారు. ఆ తర్వాత జడ్చర్ల గ్రామపంచాయతీ మున్సిపాలిటీలో విలీనం కావడంతో 2013 సెప్టెంబర్ నుంచి 2014 మే వరకు 9 నెలలు అదనంగా 43 మంది కార్మికుల డబ్బులు సైతం కట్ చేశారు. వీరితోపాటు అదనంగా కొందరు కార్మికులు కలుపుతూ మొత్తంగా 177 మందికి సంబంధించిన డబ్బులు కట్ చేశారు. అలా రూ.16,90,045 పీఎఫ్ నిధికి జమ చేయాల్సి ఉంది. కానీ, ఈ డబ్బులు సకాలంలో పీఎఫ్ నిధిలో జమచేయకుండా నిర్లక్ష్యం వహించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో బాదేపల్లి తిరిగి గ్రామ పంచాయతీ మారడం, మళ్లీ నగర పంచాయతీ, మున్సిపాలిటీ మారాయి. ఈ మధ్యకాలంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు మారారు. అప్పటికే కార్మికులు తమ పీఎఫ్ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని గుర్తించి ఆందోళన బాటపట్టారు.

■ కార్మికుల ఆందోళనలకు స్పందించిన అప్పటి కమిషనర్ మున్సిపాలిటీలో ఉన్న ఎల్ఆర్ఎస్ డబ్బులను మహిళా సమాఖ్య ఖాతా ద్వారా పీఎఫ్ నిధికి జమ చేయించారు. ఇక్కడే అవినీతి జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బులు పీఎఫ్ నిధికి జమచేయకుండా వాడుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆ తర్వాత 2017లో అప్పటి కమిషనర్ రూ.40లక్షలు కట్టినట్లుగా తెలుస్తుంది. అయినప్పటికి కార్మికుల ఖాతాల్లోకి మాత్రం డబ్బులు జమకావడం లేదు.

ఎలాంటి డబ్బులు రాలేదు



నా భర్త బొగ్గు చెన్నయ్య ముందు గ్రామ పంచాయతీ, తర్వాత మున్సిపాలిటీలో అనేక ఏళ్లుగా పనిచేసి రోడ్డు ప్రమాదంలో గతేడాది చనిపోయిండు. నాకు ఇద్దరు పిల్లలున్నారు. వారి చదువులకు కష్టం అవుతుంది. పీఎఫ్ పైసలు ప్రతినెలా జీతంలో కట్ చేసుకున్నరు. కానీ, దాని నుంచి ఎలాంటి లాభం లేదు. పీఎఫ్ పైసలు వస్తే నాకు ఆర్థికంగా మేలు జరుగుతుంది. ఆఫీసర్లు, ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ ఏదో ఒకటి చేసి మా సమస్య పరిష్కరించి డబ్బులు వచ్చేలా చూడాలి.

– అరుణ, జడ్చర్ల

ఫిర్యాదులు చేశాం..



పీఎఫ్, ఈఎస్‌ఐ డబ్బులు జీతాల్లోంచి కట్ అయినా మా ఖాతాల్లో జమ చేయలేదని మున్సిపాలిటీ నుంచి హైదరాబాద్ సీఎండీ కార్యాలయం వరకు ఫిర్యాదులు చేశాం. అనేకమార్లు ఆందోళనలు చేపట్టినం. 12 ఏళ్లుగా సమస్య మాత్రం తీరడం లేదు. అధికారులు స్పందించి మా సమస్య పరిష్కరించి మా ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. ఇప్పటి వరకు 27 మంది కార్మికులు చనిపోయారు. వారికి ఎలాంటి లబ్ధి చేకూరలేదు.

– మహేష్, అధ్యక్షుడు, మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్

కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం



కార్మికుల పీఎఫ్, ఈఎస్‌ఐ డబ్బులకు సంబంధించిన సమస్య చాలా రోజులుగా ఉంది. పీఎఫ్ నిధికి రూ.90 లక్షలు కట్టాలని ఇప్పటికే నోటీసులు వచ్చాయి. ఆ విషయాన్ని కౌన్సిల్‌లో చర్చించి డబ్బులు చెల్లింపునకు చర్యలు తీసుకుంటాం. ఆ తర్వాత కార్మికుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసే విషయంలోనూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

పరిష్కారానికి కృషి..



చాలా ఏళ్లుగా సమస్య తీరలేదని కార్మికులు చెబుతున్నారు. ఎక్కడ సమస్య ఉందో తెలుసుకుని దాని పరిష్కారానికి కృషిచేస్తాం. కార్మికులకు అన్యాయం జరిగిందని తెలుస్తుంది. దానిని సరిచేసేందుకు ప్రయత్నిస్తాం. అవసరమైతే ఎమ్మెల్యే సహకారం తీసుకుంటాం.

– పుష్పలత, మున్సిపల్ చైర్‌పర్సన్, జడ్చర్ల

విచారణకు కమిటీ

గతేడాది ఆగస్టులో కార్మికులు నిరవధిక సమ్మెకు పూనుకోగా స్పందించిన కలెక్టర్ జెడ్పీ సీఈఓ నేతృత్వంలో ఓ కమిటీని వేసింది. ఆయన మున్సిపాలిటీలో విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందజేసినా ఉపయోగం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా పీఎఫ్ నిధి నుంచి రూ.90 లక్షలు కట్టాలంటూ మున్సిపాలిటీకి నోటీసులు అందాయి. ఆ డబ్బులు చెల్లిస్తేనే 2012- 2014 ఏడాది మధ్య కార్మికుల పీఎఫ్ ప్రయోజనాలు పొందగలుగుతారు. మొత్తంగా 12 ఏళ్లుగా పీఎఫ్ సమస్య నానుతూనే ఉంది. ఈ మధ్య కాలంలోనే మొత్తం 27మంది కార్మికులు వివిధ కారణాలతో మృతి చెందారు. ప్రస్తుతం వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. పీఎఫ్ నుంచి లబ్ధి పొందాల్సి ఉన్నప్పటికీ ఒకరిద్దరి అలసత్వం కారణంగా అన్యాయానికి గురవుతున్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో బాలిక మృతి


శ్రీజ(ఫైల్)

నవాబుపేట: పండుగకు అమ్మమ్మ ఇంటికి వెళ్లిన బాలిక పాముకాటుకు గురై మృతిచెందిన సంఘటన శనివారం మండలంలోని కాకర్‌జాల్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కొల్లూర్ గ్రామానికి చెందిన కావలి చిట్టయ్య, సుగుణమ్మల కుమార్తె శ్రీజ(17) పండుగ కోసం అమ్మమ్మ ఊరైన కాకర్‌జాల్‌కు తల్లితో కలిసి వచ్చింది. శుక్రవారం రాత్రి అత్యవసరమై బయటికి వెళ్లగా అక్కడ పాము కాటేసింది. ఈవిషయాన్ని ఆమె తల్లికి చెప్పగా అక్కడి వారు మంత్రాలు చేయించటం, ఆకుపసరు వైద్యం చేశారు. అనంతరం బాలికను జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మృతురాలి తండ్రి రెండేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి సుగుణమ్మ కూలి పని చేస్తూ బాలికను షాద్‌నగర్‌లోని ఓకళాశాలలో ఇంటర్ చదివిస్తుంది.

చికిత్స పొందుతూ వ్యక్తి..


మృతుడు వాకిటి రాజు (ఫైల్)

చిన్నచింతకుంట: పురుగు మందు తాగి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని అల్లీపురంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలు.. అల్లీపురానికి చెందిన వాకిటి రాజు(36) అప్పుల బాధతో శుక్రవారం ఉదయం తన ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య జానకమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట మూసి ఉన్న దుకాణం వద్ద శనివారం మధ్యాహ్నం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు, వైద్యసిబ్బంది అతడిని పరీక్షించగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. చలికి తట్టుకోలేక, ఆహారం అందక మృతిచెంది ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు జిల్లాలోని వివిధ వాట్సప్ గ్రూపుల్లో మృతుడి ఫొటోను పోస్ట్ చేశారు. చివరకు పాన్‌గల్ మండలం శాగాపూర్‌కు చెందిన పుట్టపాగ చంద్రయ్యగా గుర్తించామని ఎస్‌ఐ నరేందర్ వివరించారు.

వివాహిత బలవన్మరణం

రాజోళి: భర్త వేధింపులను తట్టుకోలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజోళి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీష్ వివరాల మేరకు.. కర్నూల్ జిల్లా పులకుర్తి గ్రామానికి చెందిన సువార్తమ్మ (35), రాజోళి మండలం మాన్‌దొడ్డికి చెందిన యేసురాజుకు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి పదేళ్ల వయసు గల కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా యేసురాజ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఆయన వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అయిజలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి తల్లి మార్తమ్మ ఫిర్యాదు మేరకు భర్త యేసురాజపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


అత్యాచారయత్నంపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. ఖిల్లాఘనపురం మండలం పర్వతాపురానికి చెందిన ఓ వృద్ధురాలు డిసెంబర్ 31న తన భర్తతో కలిసి ఇంట్లో నిద్రిస్తుంది. జనవరి 1వ తేదీ తెల్లవారుజామున ఆమె భర్త పాలు పిండటానికి బయటకెళ్లాడు. ఇదే సమయంలో షాపురం గ్రామానికి చెందిన కొమ్మ మహేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో వారి ఇంట్లోకి చొరబడి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. వృద్ధురాలు కేకలు వేయగా చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోగా అతను పరారయ్యాడు. ఈ విషయమై శనివారం బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- శనివారం నందివాహనంపై ఊరేగిన స్వామి, అమ్మవార్లు
- కిటకిటలాడుతున్న ఉమామహేశ్వరం ఆలయ పరిసరాలు


ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


నంది వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

అచ్చంపేట: నల్లమల కొండల్లో వెలసిన ఉమామహేశ్వరుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పార్వతీ పరమేశ్వరుల వేడుకలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ముస్లిం మహిళలు సైతం సందర్శించి పాపనాశిని గుండం వద్ద మొక్కులు తీర్చుకోవడం కనిపించింది. శనివారం ఉదయం నుంచి ఆలయంలో గవ్యాంత పూజలు, అమ్మవారికి అభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, రుద్రాభిషేకం, శ్రీసూక్త, దుర్గా సూక్త, రుద్రహోమం, సాయంత్రం సాయమౌపాసన, మృగయాత్ర వినోదం, నీరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు వేద పండితులు వీరయ్యశాస్త్రి, నీలకంఠశాస్త్రి నిర్వహించారు. సాయంత్రం నందివాహన సేవ కొనసాగింది. ఉమాసతులను ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు వేదపడింతుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల సంకీర్తనల నడుమ నంది వాహనంలో ఊరేగించారు. స్వామివారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కాలినడకనే కొండపైకి..

ఉమామహేశ్వరం కొండపైకి వాహనాలను అనుమతించడం లేదు. కింద భోగ మహేశ్వరం ఆంజనేయస్వామి ఆలయం వెనుక భాగంలో ద్విచక్ర వాహనాలు, పంచాయతీరాజ్ అతిథిగృహం వద్ద ఇతర వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. కొండపైకి వీఐపీ వాహనాలను కూడా అనుమతించక పోవడంతో బస్సుల్లో లేదా మెట్ల మార్గంలో కాలినడకన ఆలయానికి చేరుకుంటున్నారు. ఉత్సవాల సందర్భంగా అచ్చంపేట ఆర్టీసీ డిపో అచ్చంపేట, రంగాపూర్, భోగ మహేశ్వరం నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

పోలీసు బందోబస్తు...

ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ రవీందర్, ఎస్‌ఐ రమేశ్, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కిటకిటలాడిన రంగాపురం

ప్రారంభమైన హజ్రత్ నిరంజన్‌షావలీ ఉర్సు

- వేలాదిగా తరలివస్తున్న భక్తులు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

అచ్చంపేట: మతసామరస్యానికి ప్రతీక అయిన అచ్చంపేట మండలం రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ ఉర్సు శనివారం తెల్లవారుజామున ప్రారంభమైంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు జరిగిన గంధోత్సవానికి వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధం వేడుకకు ఒకరోజు ముందుగానే భక్తులు రంగాపూర్‌కు చేరుకున్నారు. హిందూ ముస్లిం తేడా లేకుండా ఉర్సులో పాల్గొని కందూర్లు చేసి దర్గాలో ఫాతేహాలిచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉర్సు వారం పాటు కొనసాగనుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. సీఐ రవీందర్, ఎస్‌ఐ రమేశ్ బందోబస్తు ఏర్పాట్లు చూస్తున్నారు.

ఉమామహేశ్వర క్షేత్ర సందర్శన..
రంగాపూర్‌కు 5 కిలోమీటర్ల దూరంలో కొండపై వెలిసిన ఉమామహేశ్వర క్షేత్రాన్ని దర్గా దర్శనం అనంతరం సందర్శించడం భక్తుల ఆనవాయితీ. ఉర్సుకు మూడురోజుల ముందే ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రంగాపూర్ ఉర్సుకు వచ్చిన భక్తులు కుల మతాలకు అతీతంగా స్వామివారిని దర్శించుకుంటారు.


దర్గా ఆవరణలో జన సందోహం

ఘనంగా లక్ష్మీనృసింహుడి తెప్పోత్సవం


తెప్పోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ సమీపంలో ఉన్న గుండంలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పలో ఉంచి భక్తుల సమక్షంలో వేదపండితులు, అర్చకులు నీటిపై తిప్పారు. అంతకుముందు గురుడ వాహనసేవ, జంట సేవలు, పారువేట, పద్యపఠనం, మంగళహారతి ఇచ్చారు. ఉదయం స్వామివారికి అభిషేకం, నిత్యహోమం, గణపతి, నవగ్రహ, సర్వతోభద్ర వాహన సేవలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు రత్నగిరి కొండపై ఉన్న అమ్మవారికి అభిషేకం చేశారు. కార్య క్రమంలో భక్తులు, వేద పండితులు పాల్గొన్నారు.

వయో పరిమితి పెంపుపై స్పష్టత ఇవ్వాలి

డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య


సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య

కందనూలు: ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయో పరిమితి పెంపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూలు పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఒకవేళ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచే విషయమై ప్రభుత్వానికి ఆలోచన ఉంటే వెంటనే విరమించుకోవాలని వారు కోరారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రధానోపాధ్యాయుడిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, అందుకు నిరసనగా జనవరి 20న పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని ఉపాధ్యాయ సంఘాలకు పిలుపునిచ్చారు.

కాకతీయుల కాలం నాటి వీరగల్లు శిల్పం గుర్తింపు


వీరగల్లు శిల్పాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు గ్రామంలో కాకతీయుల కాలపునాటి అరుదైన వీరగల్లు శిల్పం గుర్తించినట్లు పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ శివనాగిరెడ్డి తెలిపారు. శనివారం ఎల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని బాపూజీ భవన్‌లో ఉన్న నల్ల శానపు రాయిపై నలువైపులా శిల్పాలతో చెక్కిన వీరగల్లును వెన్నెల సాహితీ అకాడమీ ముచ్చర్ల దినకర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు డాక్టర్ భైరాజు శ్యాంసుందర్‌తో కలిసి శివనాగిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు చెన్నకేశవుడు, రెండు, మూడో వైపు యుద్ధ దృశ్యాలు, నాలుగో వైపు ఒక స్త్రీ ఆత్మహసి దృశ్యంతో కాకతీయ కాలపు మన విధానానికి అద్దం పడుతుందని, ఈ శిల్పం నాగర్‌కర్నూల్ జిల్లాలోనే అరుదైనదని పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యత గల ఈ వీరగల్లును ఎత్తయిన పీఠంపై నిలబెట్టి చారిత్రక వివరాల బోర్డును ఏర్పాటు చేసి కాపాడుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సారగోని కృష్ణయ్యగౌడ్, సాయికిరణ్, అద్దంకి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్ద ధన్వాడలో ఇథనాల్ అలజడి


ఆందోళనకు సిద్ధమైన గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ అలజడి మళ్లీ మొదలైంది. కొద్ది రోజుల కిందట స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు నిరసనలు తెలుపడంతో పనులు నిలిచిపోయాయి. తాజాగా శనివారం రెండు క్రేన్లు ఫ్యాక్టరీ ప్రదేశంలో కనిపించడంతో పాటు రెండు కంటైనర్లు గ్రామంలోకి వస్తున్నాయని తెలుసుకున్న గ్రామస్తులు ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా పరిసర గ్రామాలకు కూడా తెలియడంతో వారు కూడా నిరసన చేయాలని తీర్మానించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అయిజ నుంచి పెద్ద ధన్వాడకు వస్తున్న కంటైనర్లను చిన్న తాండ్రపాడు వద్ద నిలిపివేశారని గ్రామస్తులు వివరించారు. మళ్లీ పనులు ప్రారంభిస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ఈ సందర్భంగా గ్రామస్తులు హెచ్చరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- రెండు కార్లు ఢీకొన్న ఘటనలో యువకుడు..
- టిప్పర్ ఢీకొని మరొకరు..
- ఏడుగురికి తీవ్రగాయాలు


హాజీపూర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఢీకొన్న కార్లు

ఉమ్మడి జిల్లాలో శనివారం జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. అతివేగంగా ఓవర్‌టేక్ చేయబోయి రెండు కార్లు ఢీకొట్టి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. అలాగే టిప్పర్ ఢీకొట్టి మరో వ్యక్తి మరణించాడు. బైక్ అదుపు తప్పి ఇంకో వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమాదాల్లో ఏడు మందికి తీవ్రగాయాలయ్యాయి.

అతివేగంతో ఓవర్‌టేక్ చేయబోయి..

అచ్చంపేట రూరల్: అతివేగంతో ఓవర్‌టేక్ చేయబోయి రెండు కార్లను ఢీకొట్టిన కారులోని ఓ యువకుడు దుర్మరణం చెందగా ఐదుమందికి తీవ్రగాయాలైన ఘటన శనివారం మండలంలోని హాజీపూర్ సమీపంలో శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాకు చెందిన రెండు కుటుంబాలు శ్రీశైలం వెళ్లి దైవదర్శనం అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. హైదరాబాద్‌లోని మోయినాబాద్‌కు చెందిన బిలాల్(19), మహ్మద్‌అలీ రంగాపూర్ జాతరకు వస్తున్నారు. హాజీపూర్ సమీపంలో తమ కారును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఓకారును స్వల్పంగా.. మరోకారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న బిలాల్ అక్కడికక్కడే మృతి చెందగా మహ్మద్‌అలీ తీవ్రంగా గాయపడ్డాడు. అవతలి కారులో ప్రయాణించిన గుల్బర్గాకు చెందిన విష్ణుకాంత్, విజయలక్ష్మీ, వాసవి, మంజు, జగదీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో అచ్చంపేట ఆసుపత్రికి తరలించారు. విష్ణుకాంత్, వాసవిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.


మృతిచెందిన బిలాల్

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ఉప్పునుంతల: బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కాంసానిపల్లి సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. కాంసానిపల్లికి చెందిన బొజ్జ వెంకటేశ్వర్లు(55) అనే వ్యక్తి బైక్‌పై పొలం వద్ద వెళ్తున్నాడు. హాజీపూర్ వైపు వెళ్లే రోడ్డు మలుపు వద్ద శనివారం సాయంత్రం 7.30గంటల సమయంలో బైక్ అదుపు అదుపు తప్పడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడిడి భార్య సుధారాణితోపాటు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టిప్పర్ ఢీకొని..


దావీద్ (ఫైల్)

అయిజ: బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన మండలంలో చోటుచేసుకుంది. సీఐ టాటా బాబు తెలిపిన వివరాలు.. మండలంలోని యాపదిన్నెకి చెందిన దావీద్, ఎజికేలు, తిమ్మప్ప శనివారం పైపాడు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వెంకటాపురం స్టేజీ సమీపంలో కర్నూల్– రాయిచూర్ రోడ్డుపై ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనగా దావీదు(40) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎజికేలు, తిమ్మప్పలకు గాయాలు కాగా కర్నూలుకు తరలించి ఆస్పత్రి లో చికిత్స చేయిస్తున్నారు. దావీద్‌కు భార్య కూ తురు, కుమారుడు ఉన్నారు. సీఐ టాటాబాబు, అ యిజ ఎస్సై విజయభాస్కర్ ఘటన స్థలికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు.


ధర్నా చేస్తున్న యాపదిన్నె గ్రామస్తులు

రోడ్డుపై ధర్నా...
భారతమాల రోడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో దావీద్ మృతిచెందాడని యాపదిన్నె వాసులు కర్నూలు–రాయిచూరు రోడ్డుపై కూర్చొని ధర్నా చేశారు. టిప్పర్ డ్రైవర్ల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని వారు వాపోయారు. సీఐ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి నష్టపరిహారం ఇప్పించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. దీంతో నిరసన వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పీయూలో న్యాక్ మాక్ టీం తనిఖీలు


వీసీతో సమావేశమైన న్యాక్ మాక్ టీం సభ్యులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో యూజీసీ న్యాక్ బృందం ఈ నెల 23 నుంచి మూడు రోజులపాటు తనిఖీలు చేయనున్న నేపథ్యంలో శనివారం నలుగురు సభ్యులతో కూడిన న్యాక్ మాక్ కమిటీ విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, ప్రొఫెసర్ వీరేష్, ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, ప్రొఫెసర్ శ్రీనివాసులు బృందాలుగా ఏర్పడి పీయూతోపాటు పీజీ సెంటర్‌లో కూడా తనిఖీలు చేసి, సన్నద్ధత ప్రాధాన్యతను వివరించారు. ఇందులో పలు డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు, రిజిష్టర్లు పరిశీలించారు. అనంతరం వీసీ శ్రీనివాస్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సైకాలజిస్ట్ లక్ష్మణ్‌పై కేసు నమోదు

- శిక్షణ పేరుతో రూ.లక్షలు వసూలు చేశారని ఫిర్యాదు

మహబూబ్‌నగర్ క్రైం: కోచింగ్ సెంటర్ మాటున రూ.లక్షలు వసూలు చేసిన మహబూబ్‌నగర్‌కు చెందిన మానసిక విశ్లేషకుడు (సైకాలజిస్ట్) లక్ష్మణ్‌పై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. లక్ష్మణ్ జిల్లాకేంద్రంలోని వెంకటేశ్వరకాలనీలో స్పోకెన్ ఇంగ్లీష్ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహేష్ అనే వ్యక్తి కోచింగ్‌కు లక్ష్మణ్ వద్ద చేరారు. అలాగే బీటెక్ చేస్తున్న తన ఇద్దరు కుమారులను కౌన్సెలింగ్ కోసం అతడి వద్దకు తీసుకెళ్లగా సివిల్స్ కోచింగ్ ఇస్తానని చెప్పి దశల వారీగా రూ.40 లక్షలు వసూలు చేశారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. అలాగే శంకర్, ఇంటర్ చదువుతున్న అతడి కుమారుడు ఇంగ్లీష్ నేర్చుకోవడానికి కోచింగ్ సెంటర్‌లో చేరారు. వీరి కుటుంబీకులకు మాయమాటలు చెప్పి ఉన్న నాలుగు ప్లాట్లను విక్రయింపజేసి దశల వారీగా డబ్బులు తీసుకున్నారు. కేంద్రంలో ఉంటున్న వారిని చూసేందుకు భార్య వెళ్లగా రూ.3 వేలు చెల్లించి అపాయింట్‌మెంట్ తీసుకుంటే చూసేందుకు అవకాశం కల్పిస్తామని కేంద్రం నిర్వాహకులు చెప్పడంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో ఇరువురు బాధితులు ఎస్పీని ఆశ్రయించారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు.

ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవ

వ్యక్తిపై కత్తితో దాడి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అచ్చంపేట రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన రామకృష్ణ, సంతోష్ కలిసి కొన్ని రోజుల క్రితం ప్లాట్లు అమ్మారు. డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. శనివారం రామకృష్ణ సంతోష్‌ను డబ్బులు అడగడంతో మరోసారి గొడవ జరిగింది. ఆవేశానికి గురైన సంతోష్.. రామకృష్ణపై కత్తితో దాడి చేయడంతో కడుపు, ఛాతి, కాలిపై గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఈ విషయంపై రామకృష్ణ కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.